మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 220
పేజీలు : 3

సోమవారం 09.03.2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ



## 16 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

**టీ మీడియా, మార్చి 8,హైదరాబాద్:**

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ముహూర్తం ఫిక్స్ అయ్యింది. 2026, మార్చి 16 నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదేశాల మేరకు అసెంబ్లీ కార్యదర్శి ఆదివారం (మార్చి 8) నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. మార్చి 16 ఉదయం 11 గంటల 45 నిమిషాలకు అసెంబ్లీ సెషన్స్ ప్రారంభం కానున్నట్లు నోటిషికేషన్?లో పేర్కొన్నారు. తొలి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు.ఆ మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఇక, 2026---27 వార్షిక బడ్జెట్?ను మార్చి 20న ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్నట్లు సమాచారం. కాగా, 2026, ఫిబ్రవరి 23న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో మార్చి 16 నుంచి 30 వరకు బడ్జెట్ సమావేశాలు జరపాలని నిర్ణయించిన విషయం తెలిసిందే.






# ఈవీ స్కూటీలను ఇవ్వాలనుకుంటున్నాం

- ప్రజాభవన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు
- హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**టీ మీడియా, మార్చి 8, హైదరాబాద్ బ్యూరో :** హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రెడ్, ఆరెంజ్ కేటగిరి పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు పంపిస్తామని చెప్పారు. ప్రజాభవన్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, ఈ సందర్భంగా మహిళా జర్నలిస్టులకు సన్మానం చేశారు.

### మహిళలు యజమానులుగా ఉన్నారు

మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు ఇస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. దేశంలోని ఏ పదవైనా మహిళలకు ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అని, ఉక్కు మహిళ సంకల్పంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, మహిళలకు సరైన గుర్తింపు ఇవ్వాలని ప్రజాప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఎక్కడ అవకాశం ఉన్నా, ఉన్నత పదవుల్లో మహిళలను నియమిస్తున్నామని, హైదరాబాద్ కలెక్టర్‌గా మహిళ బాధ్యత వహిస్తున్నారని, ఎస్ఐబీ అధిపతిగా మహిళను పెట్టామని, వెయ్యి బస్సులకు మహిళలు యజమానులుగా ఉన్నారని గుర్తు చేశారు. వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేసే వారిగా స్వయం సహాయక బృందాలను తయారు చేశామని, తెలంగాణ మహిళలు తయారు చేస్తున్న వస్తువులను అమెజాన్‌లో పెట్టి ప్రపంచానికి అందిస్తున్నామని వివరించారు.

### కష్టపడే వారికి గుర్తింపు ఉండదు

మహిళ ఆర్థిక శక్తి పెరిగినప్పుడే ఆ దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్న సీఎం, దేశంలో మహిళ శ్రమకు గుర్తింపు లేదని అన్నారు. దేశంలో కుల, జెండర్ వివక్ష ఉందని, అమెరికాలో కూడా వివక్ష ఉందని కానీ అక్కడ కష్టానికి గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఇక్కడ మాత్రం కష్టపడే వారికి గుర్తింపు ఉండదని, మహిళల ఆర్థిక శక్తిని పెంచాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పెంచే ప్రణాళికలను తయారు చేశామని పేర్కొన్నారు.

### ఈవీ వాహనాలు కొనుక్కుంటే జీరో ట్యాక్స్

ఈ క్రమంలోనే హైదరాబాద్‌ను పొల్యూషన్ ఫ్రీ నగరంగా మార్చాలని రేవంత్ రెడ్డి తెలిపారు. చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారని కొనియాడారు. రెడ్, ఆరెంజ్ కేటగిరి పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు పంపిస్తామని, హైదరాబాద్‌లోని డీజిల్ బస్సులను 2026 డిసెంబర్‌లోపు జిల్లాలకు తరలిస్తామని, హైదరాబాద్‌లో 100 శాతం ఈవీ బస్సులను తెస్తున్నామని అన్నారు. డిసెంబర్ 9లోపు డీజిల్ బస్సులు హైదరాబాద్‌లో ఉండవని, హైదరాబాద్‌లో ఏసీ ఈవీ బస్సులు తెస్తామని తెలిపారు. ఈవీ వాహనాలు కొనుక్కుంటే జీరో ట్యాక్స్ అని, కళాశాలకు వెళ్లే అమ్మాయిలకు ఈవీ స్కూటీలను ఇవ్వాలనుకుంటున్నామని వెల్లడించారు.

### మూసీ ప్రక్షాళన వద్దంటున్నారా?

హైదరాబాద్‌లో కాలుష్యం, దోమలు ఎక్కువగా ఉన్నాయంటున్నారని, మూసీని ప్రక్షాళన చేస్తామంటే అడ్డుపడుతున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. మూసీ ప్రక్షాళన వద్దంటున్నారా? తొలగింపులు వద్దంటున్నారో స్పష్టత ఇవ్వాలని కోరారు. నష్ట పరిహారం ఇచ్చే బఫర్ జోన్‌లోని ఇళ్లను తొలగిస్తామని స్పష్టం చేశారు. 50 మీటర్ల బఫర్ జోన్ అనేది చట్టంలో ఉంది తాను మార్చలేనని, నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఎవరూ మీతో ఉండరని, ఓట్ల కోసమే మీ దగ్గరకు వస్తున్నారని తెలిపారు.

### గాంధీ విగ్రహానికి రూ.70 కోట్లే ఖర్చు:

గాంధీ విగ్రహం కట్టడానికి రూ.500 కోట్లు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, గాంధీ విగ్రహానికి రూ.70 కోట్లే ఖర్చు అవుతుందని సీఎం చెప్పారు. గాంధీ విగ్రహం వద్ద విజ్ఞాన మందిరానికి రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నామని, తెలంగాణ రాష్ట్రంలో మహిళకు రక్షణ మాత్రమే కాదని, అవకాశాలు కూడా ఇస్తామని తెలిపారు. సోషల్ మీడియాలో అవాస్తవాల ప్రచారంపై ఫిర్యాదులకు ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు.

# భారత్‌కు ఖతార్ భరోసా

## మార్గం తెరుచుకున్న వెంటనే ఎల్ఎన్‌జీ సరఫరా

**టీ మీడియా, మార్చి 8,ఢిల్లీ బ్యూరో:**

హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలతో తాత్కాలికంగా నిలిచిన సరఫరాలు- మార్గం తిరిగి ప్రారంభమైన వెంటనే భారత్‌కు ఎల్ఎన్‌జీ పంపుతామని ఖతార్ హామీ- దేశంలో ఇంధన నిల్వలు సురక్షిత స్థితిలోనే ఉన్నాయని కేంద్రం వెల్లడిపశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థలు ప్రభావితమవుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య పెరిగిన ఉద్రిక్తతల కారణంగా హర్మూజ్ జలసంధి ప్రాంతంలో నౌకాశ్రయం కార్యకలాపాలు దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితుల్లో భారత్‌కు సహజ వాయువు (ఎల్ఎన్‌జీ) సరఫరా విషయంపై ఖతార్ ప్రభుత్వం కీలక భరోసా ఇచ్చింది. హర్మూజ్ మార్గం తిరిగి ప్రారంభమైన వెంటనే భారత్‌కు ఎల్ఎన్‌జీ సరఫరాలను పునఃప్రారంభిస్తామని ఖతార్ తెలిపినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.ప్రస్తుతం దేశంలో ఇంధన నిల్వలు సంతృప్తికర స్థాయిలో ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. అందువల్ల తక్షణంలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ఆలోచన లేదని స్పష్టం చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో మార్పులు జరిగినా వినియోగదారులపై భారం పడకుండా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెబుతోంది. హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలక మార్గాల్లో ఒకటి. పర్షియన్ గల్ఫ్‌ను సముద్ర మార్గంతో అనుసంధానించే సన్నని మార్గం ద్వారా ప్రపంచంలోని గణనీయమైన చమురు, గ్యాస్ సరఫరాలు జరుగుతాయి. ప్రస్తుతం అక్కడ నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా కొంతకాలంగా నౌకాశ్రయం కార్యకలాపాలు అంతరాయం ఎదుర్కొన్నాయి.




### ఖతార్ స్పష్టంగా హామీ

అయితే పరిస్థితులు త్వరలోనే మెరుగుపడే సూచనలు కనిపిస్తున్నాయని అధికారులు చెప్పారు. ఇరాన్ ఇటీవల చేసిన ప్రకటనల నేపథ్యంలో పరిస్థితి కొంత శాంతించవచ్చని అంచనా వేస్తున్నారు. తమపై దాడులు జరిగితే తప్ప పొరుగు దేశాలను లక్ష్యంగా చేసుకోబోమని ఇరాన్ ప్రకటించడంతో వాణిజ్య నౌకల రాకపోకలు మళ్లీ ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్‌కు సరఫరాలు నిలిచిపోతాయన్న ఆందోళన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మార్గం తిరిగి ప్రారంభమైన వెంటనే భారత్‌కు ఎల్ఎన్‌జీ సరఫరా మొదలుపెడతామని ఖతార్ స్పష్టంగా హామీ ఇచ్చిందని పేర్కొన్నారు.

### ఆ విషయంలో ఆందోళన అవసరం లేదు

అదే సమయంలో కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి దేశ ఇంధన దిగుమతులు ప్రస్తుతం నాన్- హార్మూజ్ మార్గాల నుంచి జరుగుతున్నాయని, పౌరుల అన్ని అవసరాలు తీర్చుతామని చెప్పారు. భారత్ సౌకర్యవంతమైన స్థితిలో ఉందని, ఆ విషయంలో ఆందోళన లేదా ఊహాగానాలకు అవకాశం లేదని చెప్పారు.ఇదిలా ఉండగా భారత్‌కు ఇతర దేశాల నుంచి కూడా ఎల్ఎన్‌జీ సరఫరా చేసేందుకు ఆసక్తి వ్యక్తమవుతోందని అధికారులు చెప్పారు. ప్రస్తుతం దేశంలో ఎల్ఎన్‌జీ నిల్వలు సరిపడా ఉన్నాయని, అవసరమైతే ప్రత్యామ్నాయ సరఫరాదారుల నుంచి కొనుగోలు చేసే అవకాశాలు కూడా ఉన్నాయని వెల్లడించారు. గత కొన్ని సంవత్సరాలుగా భారత్ తన ఇంధన దిగుమతులను విభిన్న ప్రాంతాల నుంచి పొందే విధంగా వ్యూహాన్ని అమలు చేస్తోంది. ముఖ్యంగా హర్మూజ్ జలసంధిపై ఆధారాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంది. ఈ చర్యల ఫలితంగా ప్రస్తుతం హోర్ముజ్ మార్గం బయట ప్రాంతాల నుంచి వచ్చే చమురు దిగుమతులు పెరిగాయని అధికారులు తెలిపారు.ఇంతకుముందు భారత్‌కు వచ్చే మొత్తం చమురు దిగుమతుల్లో సుమారు 60 శాతం హర్మూజ్ జలసంధి వెలుపలి మార్గాల నుంచే వచ్చేవి. ఇప్పుడు అది 70 శాతానికి పెరిగిందని చెప్పారు. అంటే ఈ మార్గంపై ఆధారపడే స్థాయి తగ్గిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇంధన భద్రతను మరింత బలోపేతం చేయడానికి అవసరమైతే రష్యా వంటి ఇతర దేశాల నుంచి కూడా అదనపు ఎల్ఎన్‌జీ కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. ఇప్పటికే పలుదేశాలు భారత్‌కు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం అందిందని చెప్పారు.

### పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే యోచన లేదు

ఇక చమురు సరఫరాల విషయంలో కూడా భారత్ ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సౌదీ అరేబియాలోని యాన్‌బూ నుంచి క్రూడ్ ఆయిల్ కార్గోలను ఇప్పటికే సురక్షితం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగవచ్చున్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే యోచన లేదని అధికార వర్గాలు తెలిపారు. వినియోగదారులను అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకుల నుంచి రక్షించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇక ఎల్‌పీజీ ధరలపై వస్తున్న ఆరోపణలను కూడా ప్రభుత్వం ఖండించింది. ధరల స్థిరత్వం గురించి ఇచ్చిన హామీ పెట్రోల్, డీజిల్‌కే వర్తిస్తుందని, ఎల్‌పీజీకి సంబంధించలేదని అధికారులు తెలిపారు.కొంతకాలం క్రితం ఎల్‌పీజీ నిల్వలపై ఆందోళన ఉన్నప్పటికీ ఇప్పుడు పరిస్థితి మెరుగుపడిందని చెప్పారు. తాజాగా గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ.60 మాత్రమే పెంచినట్లు పేర్కొన్నారు. వాస్తవానికి మార్కెట్ పరిస్థితులను బట్టి సుమారు రూ.134 పెంపు అవసరమైందని లెక్కలు చూపించాయని తెలిపారు. అయితే వినియోగదారులపై భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం మిగిలిన మొత్తాన్ని భరించిందని వెల్లడించారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద అందుతున్న సబ్సిడీ కొనసాగుతుందని కూడా అధికారులు స్పష్టం చేశారు. ఈ పథకం లబ్ధిదారులకు ఒక్క సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ అందుతుందని తెలిపారు. దీంతో వారు సుమారు రూ.560 చొప్పున సిలిండర్ పొందుతున్నారని చెప్పారు.

## తెలంగాణలో ఇక మిగిలింది

# ఆ ఏడుగురే

## లొంగిపోయిన మావోయిస్టులకు

# రూ.4 కోట్ల రివార్డు

**టి మీడియా, మార్చి 8, హైదరాబాద్ బ్యూరో:** మావోయిస్టు పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న వారిలో తెలంగాణ రాష్ట్రం నుంచి 7 మంది ఉన్నారని డీజీపీ శివధర్‌రెడ్డి శనివారం ప్రకటించారు. ప్రస్తుతం వారంతా అజ్ఞాతంలోనే ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. శనివారం వరకు ఈ సంఖ్య 11గా ఉందన్న ఆయన, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం ఎర్రంపాడుకు చెందిన బడిషా ఉంగా అలియాస్ మంతు, అదే గ్రామానికి చెందిన మడివి అడుమే అలియాస్ సంగీత, గద్వాల జిల్లా మక్తల్ మండలం జక్లేర్‌కు చెందిన ఉతిమి అనిల్ కుమార్ అలియాస్ భగత్‌సింగ్, అదే జిల్లా మల్దకల్ మండలం కుర్తిరావుల చెరువుకు చెందిన కాశపోగు భవాని అలియాస్ సుగుణ శనివారం సీఎం సమక్షంలో జనజీవన స్రవంతిలో కలిసిపోవడంతో ప్రస్తుతం ఏడుగురు మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ వివరించారు.

### - ఇక మిగిలిన మావోయిస్టులు వీరే

ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి (పార్టీ మాజీ సుప్రీం) - జగిత్యాల జిల్లా బీర్‌పూర్‌జోడే రత్నాబాయి అలియాస్ సుజాత (కేంద్ర కమిటీ సభ్యురాలు - గణపతి భార్య) - గద్వాల జిల్లా బుధారపుపేటపుసునూరి నరహరి అలియాస్ సంతోశ్? (కేంద్ర కమిటీ సభ్యుడు) - హనుమకొండ జిల్లా సోమిడినక్క సుశీల అలియాస్ రేల (డీకేఎస్‌జడ్‌సీ డీసీఎం) - హైదరాబాద్‌వార్తా శేఖర్ అలియాస్ మంగ్తూ (డీకేఎస్‌జడ్‌సీ కమ్యూనికేషన్ విభాగం ఇన్‌ఛార్జి) - సికింద్రాబాద్‌రంగబోయిన భాగ్య అలియాస్ రూపి(మాడ్ ఏసీఎం) - సిద్దిపేట జిల్లా మిరిదొడ్డికుంజం ఇడ్మల్ (ఏసీఎం) - భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తడపల

గణపతి లొంగిపోతే ఆయన బాధ్యత మాదే : మావోయిస్టుల అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ్?రావు లొంగిపోతే ఆయన ఆరోగ్యం, రక్షణ బాధ్యత తెలంగాణ ప్రభుత్వానిదేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణలో హింసకు తావు లేదన్న ఆయన, ఇప్పటికీ అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులంతా ఆయుధాలను వదిలేస్తే వారు లేవనెత్తే అంశాలపై చర్చించేందుకు తాము అన్నివేళలా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎంతటి సమస్యకైనా చర్చలే అంతిమ పరిష్కారం అనేది ప్రస్తుతం ప్రపంచం మొత్తం అనుసరిస్తున్న విధానమన్నారు.

### - 124 ఆయుధాలతో చరిత్రలో జరగలేదు

జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులు తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేనిరీతిలో 130 మంది మావోయిస్టులు ఏకంగా 124 ఆయుధాలతో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో శనివారం లొంగిపోయారు. ఈ సందర్భంగా హైదరాబాద్ కమాండ్? కంట్రోల్ సెంటర్?లో నిర్వహించిన సమావేశంలో డీజీపీ శివధర్‌రెడ్డి ఇతర పోలీసు ఉన్నతాధికారులతో కలిసి లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణ సాయం కింద నగదు అందించారు. వారు అప్పగించిన పలు ఆయుధాలను ఆసక్తిగా పరిశీలించారు.

### - మొత్తం రూ.4 కోట్ల రివార్డు

సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో శనివారం లొంగిపోయిన 130 మంది మావోయిస్టులకు మొత్తంగా రూ.4,18,20,000 రివార్డును తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర కమిటీ సభ్యురాలి హోదాలో చలసాని నవతకు రూ.20 లక్షలు, ఏరియా కమిటీ సభ్యుల హోదాలో కాశపోగు భవాని, భగత్‌సింగ్, బడిసే ఉంగయ్య, మడావి అడిమేలకు రూ.4 లక్షల చొప్పున అందజేయనున్నట్లు పోలీసులు తెలిపారు.



### - ఆయుధాలు తెచ్చిన వారికి అదనపు ప్రోత్సాహం

వీరితో పాటు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 125 మంది మావోయిస్టులకు తాత్కాలిక ఉపశమనం కింద రూ.25 వేల చొప్పున సభలోనే అందించారు. వారిలో ఆయుధాలతో లొంగిపోయినందుకు కేంద్ర హోంశాఖ మార్గదర్శకాల మేరకు మరింత అదనపు ప్రోత్సాహకాన్ని అందించారు. ఎల్ఎంజీకి రైఫిల్?కు రూ.5 లక్షలు, ఏకే-47కు రూ.4 లక్షలు, ఎస్ఎల్ఆర్‌కు రూ.2 లక్షలు, ఇన్సాస్ రైఫిల్‌కు రూ.2 లక్షలు, .303 రైఫిల్‌కు రూ.లక్ష, యూజీబీఎల్ ఎటాచ్‌మెంట్‌కు రూ.40 వేలు, 12బోర్, సింగిల్‌షాట్ గన్‌లకు రూ.30 వేల చొప్పున నగదును అందించారు.

## అధికారికంగా జేడీయూలో చేరిన నిశాంత్..?

3లో..

# అధికారికంగా జేడీయూలో చేరిన నిశాంత్..?

- ఘన స్వాగతం పలికిన పార్టీ పెద్దలు



**టీ మీడియా, మార్చి 8,పట్నా :**
బిహార్ సీఎం నీతీశ్‌కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ జేడీయూలో చేరారు. పట్నాలోని జేడీయూ హెడ్‌క్వార్టర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి రాజీవ్ రంజన్‌సింగ్, జేడీయూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్ ఝా సహా పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిశాంత్? పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.తన తండ్రి పెద్దల సభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని, అది ఆయన సొంతంగా తీసుకున్న నిర్ణయమని పేర్కొన్నారు. ఆయన నిర్ణయాన్ని అందరం గౌరవిస్తున్నట్లు చెప్పారు. తనతండ్రి మార్గదర్శకత్వంలో తామంతా పనిచేస్తామని నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. 20ఏళ్లు బిహార్ ముఖ్యమంత్రిగా పనిచేసిన తన తండ్రి రాష్ట్రానికి ఎంతో సేవ చేశారని చెప్పారు. బిహార్ ప్రజలు ఆయన చేసిన అభివృద్ధిని ఎప్పటికీ మరిచిపోరని తెలిపారు. పార్టీ కండువా కప్పుకున్న అనంతరం తండ్రి నీతీశ్?ను కలిసి మిఠాయి తినిపించారు. ఆయన వెంట సంజయ్? ఝా కూడా ఉన్నారు.

**నిశాంత్ ఉపముఖ్యమంత్రి అవుతారా?**
మరోవైపు, బిహార్?లో కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలో నిశాంత్ డిప్యూటీ సీఎం అవుతారని ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నీతీశ్? కుమార్ సన్నిహితుడు ఒకరు శనివారం మాట్లాడారు. తండ్రి రాజీనామా అనంతరం ఏర్పడే కొత్త ప్రభుత్వంలో నిశాంత్‌ను డిప్యూటీ సీఎంగా చేయాలని ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి నీతీశ్? కుమార్ గురువారం రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

**'జై నిశాంత్?, జై నీతీశ్'? అంటూ నినాదాలు**
ఇదిలా ఉండగా, నిశాంత్ జేడీ(యూ) కార్యాలయానికి చేరుకున్నప్పుడు ఆయనకు ఘన స్వాగతం లభించింది. పార్టీ కార్యకర్తలు కార్యాలయం వెలుపల గుమిగూడి పార్టీ జెండాలు ఊపుతూ, డ్రమ్స్ వాయిస్తూ కనిపించారు. నిశాంత్? అధికారికంగా పార్టీలో చేరిన అనంతరం అక్కడే ఉన్న కార్యకర్తలు 'నీతీశ్? కుమార్? జిందాబాద్?, జై నీతీశ్?, జై నిశాంత్?' అంటూ నినాదాలు చేశారు. ప్రతిగా నిశాంత్ చేతులు జోడిస్తూ అందరికీ నమస్కారం చేశారు. తరువాత జేడీయూ సభ్యత్వ రసీదును నిశాంత్?కు అందించారు సంజయ్? ఝా. పార్టీ టోపీని తలపై పెట్టుకుని, కండువాను మెడలో వేసుకున్నారు నిశాంత్?. అనంతరం, అక్కడే ఉన్న పార్టీ సీనియర్ నాయకులు, మంత్రులు, శాసనసభ్యులు నిశాంత్?ను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. త్వరలో ఆయన ప్రజలకు సేవ చేయనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు.

**సంబురాలు చేసుకున్న కార్యకర్తలు**
ఇదిలా ఉండగా, పార్టీ కార్యాలయానికి చేరుకోకముందు నిశాంత్? పట్నా జంక్షన్? సమీపంలో ఉన్న మహావీర్ ఆలయాన్ని సందర్శించారు. అక్కడ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం బిహార్? శాసనసభ వెలుపల ఉన్న అమరవీరుల స్మారక చిహ్నం వద్దకు చేరుకుని నివాళులు అర్పించారు. అక్కడి నుంచి జేడీయూ కార్యాలయానికి బయలుదేరారు. నిశాంత్? పార్టీ కార్యాలయానికి చేరుకోగానే జేడీయూ కార్యకర్తలు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. డప్పులు వాయిస్తూ సంబురాలు చేసుకున్నారు. నిశాంత్? పార్టీలో చేరడాన్ని స్వాగతిస్తూ, మిఠాయిలు తినిపించుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్త పరిచారు. మరికొంత మంది కార్యకర్తలు ఏనుగులు, ఒంటెలు, గుర్రాలను తీసుకువచ్చి వాటిని వీధుల్లో ఊరేగించారు. 'నిశాంత్ హై తో నిష్చింత్ హై'(నిశాంత్ ఉంటే మేం చింత లేకుండా ఉంటాం) అంటూ నినాదాలు చేశారు.

## వైభవంగా ప్రారంభమైన దుర్గమ్మ, పోచమ్మ జాతర ఉత్సవాలు



**టీ మీడియా,మార్చి 8, టేక్మాల్ ప్రతినిధి:**
మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. స్థానిక ఆనవాయితీ ప్రకారం హోలీ పండుగ ముగిసిన ఐదవ రోజున ప్రారంభమయ్యే ప్రసిద్ధ దుర్గమ్మ, పోచమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా మొదలయ్యాయి. ఐదు రోజుల పాటు సాగే ఈ వేడుకల మొదటి రోజున భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

**ఆధ్యాత్మిక వాతావరణంలో బోనాల ఉత్సవం**
జాతర తొలిరోజైన ఆదివారం గ్రామ ముత్తైదువలు భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలను సమర్పించారు. ఉదయం నుండే ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు, కొత్త కుండలలో బోనాలను వండి, వాటిని పూలతో అందంగా అలంకరించారు. అనంతరం డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. శివసత్తుల పూనకాలు, భక్తుల కోలాహలంతో టేక్మాల్ వీధులన్నీ మారుమోగిపోయాయి. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి, అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించి గ్రామస్తులంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు.

**సర్వాంగ సుందరంగా ఆలయ ప్రాంగణం**
జాతర దృష్ట్యా ఆలయ కమిటీ వారు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రంగురంగుల విద్యుత్తు దీపాలతో ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాత్రి వేళలో విద్యుత్ కాంతులతో ఆలయం వెలిగిపోతోంది. భారీగా తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లు, తాగునీరు వంటి కనీస సౌకర్యాలను నిర్వాహకులు పర్యవేక్షిస్తున్నారు.

**రేపు ప్రధాన ఘట్టం: బండ్ల ఊరేగింపు**
ఉత్సవాల్లో రెండో రోజైన సోమవారం జాతరలో అత్యంత కీలకమైన 'బండ్ల ఊరేగింపు' కార్యక్రమం జరగనుంది. రైతులు తమ ఎడ్ల బండ్లను రంగులతో, పూలతో అందంగా అలంకరించి ఆలయం చుట్టూ తిరుగుతూ ప్రదర్శన ఇస్తారు. ఈ వేడుకను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది.




## మున్సిపల్ చైర్మన్‌కు హొలియ దాసరి సన్మానం

**టీ మీడియా, మార్చి 8 , పెబ్బేరు :**
హోలియా దాసరి సంక్షేమ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ కు ఘన సన్మానం హొలియ దాసరి కమిటీ ఆధ్వర్యంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ కు నాల్గవ వార్డు కౌన్సిలర్ దాసరి జమ్ములమ్మ కు ఘనంగా సన్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో హొలియ దాసరి సంక్షేమ సంఘం జిల్లా నాయకులు చాను వర్ధన్ పెద్ద రాములు చిన్న రాములు వెంకటయ్య ఈశ్వరయ్య క్రిష్ణ గోవిందమ్మ వైజయంతి తదితరులు పాల్గొన్నారు చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ కు నాల్గవ వార్డు కౌన్సిలర్ దాసరి జమ్ములమ్మ కు ఘనంగా సన్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో హొలియ దాసరి సంక్షేమ సంఘం జిల్లా నాయకులు చాను వర్ధన్ పెద్ద రాములు చిన్న రాములు వెంకటయ్య ఈశ్వరయ్య క్రిష్ణ గోవిందమ్మ వైజయంతి తదితరులు పాల్గొన్నారు.



## మహిళా కానిస్టేబుల్‌కు ఘన సన్మానం


**టీ మీడియా, మార్చి 8 , టేక్మాల్ ప్రతినిధి:**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం మెదక్ జిల్లా టేక్మల్ పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌ను ఘనంగా సన్మానించారు. స్టేషన్ పరిధిలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరుస్తున్న మహిళా కానిస్టేబుల్‌ను గుర్తించి ఈ గౌరవం అందించారు.ఈ సందర్భంగా టేక్మల్ ఎస్సై అరవింద్ కుమార్ మాట్లాడుతూ. సమాజ రక్షణలో పురుషులతో సమానంగా మహిళా పోలీసులు కూడా అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. అనంతరం మహిళా కానిస్టేబుల ను శాలువాతో సత్కరించి, పూలమాల వేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీస్ శాఖలో మహిళల సేవలు వెలకట్టలేనివని, వారు అందిస్తున్న సహకారం వల్ల శాంతిభద్రతల పరిరక్షణ సులువవుతోందని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## పుర చైర్మెన్‌ను సన్మానించిన వడ్డెర సంఘం

**టీ మీడియా మార్చి 8,పెబ్బేరు:**
ఆదివారం పెబ్బేరు మున్సిపల్ నూతన చైర్మన్ ను వనపర్తి జిల్లా వడ్డెర సంఘం నాయకులు జాతీయ కార్యదర్శి వడ్డె ఈశ్వర్ ఘనంగా సన్మానించి పూల బొకేతో శుభాకాంక్షలు తెలియజేసారుజిల్లా యూత్ అధ్యక్షులు వడ్డె అంజి వడ్డెర సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డె రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అలాగే వడ్డె ఈశ్వర్ మాట్లాడుతూ మున్సిపల్ పాలకవర్గం లో వడ్డెరులకు స్థానం కల్పించాలని వారు కోరారు.ఈ కార్యక్రమం లో వడ్డెర సంఘం నాయకులు బలరాం వెంకటయ్య పరుశు రాం మైబు రామక్రిష్ణ శేఖర్ అంజి తదితరులు పాల్గొన్నారు.


## ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్ట్ హెల్త్ క్యాంప్



**టీ మీడియా మార్చి 08 ముదిగొండ :**
మండల ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేడు సోమవారం ఉదయం 10 గంటలనుండి, ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో స్పెషలిస్ట్ హెల్త్ క్యాంప్ నిర్వహించబడుతుందని డా. జాలాది నాగేంద్ర ప్రసాద్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ తెలియజేసారు. **అందుబాటులో ఉండే ప్రత్యేక వైద్య విభాగాలు:**
1. ప్రసూతి మరియు గైనకాలజీ 2. పిల్లల వైద్యం 3. నేత్ర వైద్యం 4. ఆర్థోపెడిక్ 5. జనరల్ మెడిసిన్ 6. దంత వైద్యం. కావున ప్రజలందరు కుడా ఈ యొక్క కార్యక్రమం సద్వినియోగం చేసుకోగలరని నేడు జరిగే హెల్త్ క్యాంప్ ను విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాము.

# కరెంట్ ఛార్జీలపై ప్రభుత్వం ప్రకటన

- ధరల పెంపుపై క్లారిటీ..



**టీ మీడియా, మార్చి 8,హైదరాబాద్:**
తెలంగాణలో కరెంట్ ఛార్జీలు పెరుగుతాయనే ప్రచారం గత కొద్దిరోజులుగా సాగుతోంది. రాష్ట్రంలో విద్యుత్‌కు డిమాండ్ పెరగడం, వినియోగం కూడా భారీగా పెరిగిన క్రమంలో ధరల పెంపు ఉండొచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ వార్తలపై ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ స్పందించింది. ఈ మేరకు విద్యుత్ ఛార్జీల పెంపు వార్తలపై క్లారిటీ ఇస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. ధరలను పెంచనున్నట్లు బయట జరుగుతున్న ప్రచారాన్ని ఖండించిన ఈఆర్సీ.. అవన్నీ తప్పుడు వార్తలంటూ కొట్టిపారేసింది. ప్రజలు వాటిని నమ్మవద్దని సూచనలు జారీ చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కరెంట్ ఛార్జీలు టారిఫ్‌లు పెంచే ఆలోచన లేదని స్పష్టం చేసింది. ఊహాగానాలను ఎవరూ నమ్మవద్దని, ఏదైనా ఉంటే తమ నుంచి అధికారిక ప్రకటన ఉంటుందని పేర్కొంది.

**ప్రతిపాదన లేదు**
విద్యుత్ ఛార్జీల పెంపుకు సంబంధించి తమ వద్ద ఎలాంటి ప్రతిపాదన లేదని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఛార్జీల పెంపు ఉండదని తెలిపింది. టైమ్ ఆఫ్ ద డే ఛార్జీల పెంపు కూడా ఉండదని స్పష్టం చేసింది. విద్యుత్ ఛార్జీల ద్వారా కేవలం రూ.40,659 కోట్ల ఆదాయం మాత్రమే వస్తుందని, తమకు రూ.50,242 కోట్ల ఆదాయం అవసమని ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతానికి రూ.9,583 కోట్ల రెవెన్యూ లోటు ఉందని, దీనికి భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. ఇందుకోసం ప్రభుత్వ సహకారం కోరుతున్నట్లు ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చెప్పుకొచ్చింది.

ఇక విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు ప్రభుత్వం నుంచి బకాయిలు పెద్ద మొత్తంలో రావాల్సి ఉన్నప్పటికీ.. వినియోగదారులపై భారం పడకుండా లోటను ప్రభుత్వం భరిస్తుందని తెలిపింది. తెలంగాణలో విద్యుత్ వినియోగం రికార్డ్ స్థాయిలో పెరుగుతుంనది, కొత్త వినియోగదారులు వస్తూనే ఉన్నారని స్పష్టం చేసింది.

**తగ్గిన విద్యుత్ వ్యయం**
ఎస్‌పీడీసీఎల్ పరిధిలో గత ఏడాది కంటే 12 లక్షల మంది కొత్త వినియోగదారులు రాగా.. గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 20,975 మెగావాట్లకు చేరుకునే అవకాశముందని ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిటీ తెలిపింది. విద్యుత్ వినియోగంలో పారిశ్రామిక రంగం మొదటి స్థానంలో ఉండగా.. గృహ వినియోగదారులు రెండో స్థానంలో ఉన్నారు. ఇక వ్యవసాయం రంగం 21 శాతం వాటాతో మూడో స్థానంలో ఉంది. నాణ్యమైన విద్యుత్‌ను ప్రజలకుక అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొంది. విద్యుత్ కొనుగోలు వ్యయ్యం తగ్గగా.. నష్టాలను కూడా తగ్గించామని పేర్కొంది. ఇక 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పథకం వల్ల ఫిబ్రవరి నాటికి 5.44 కోట్ల జీరో బిల్లులను విద్యుత్ శాఖ జారీ చేయగా.. ప్రభుత్వం నుంచి రూ.1930 కోట్ల సబ్సిడీ సొమ్ము వచ్చింది.

# సామాన్యుడి వంటింట్లో గ్యాస్ మంట

- ధరల పెంపుపై వెల్లువెత్తుతున్న నిరసనలు







**టీ మీడియా మార్చి 08 ముదిగొండ :**
దేశవ్యాప్తంగా సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. నిత్యావసర వస్తువుల ధరలు ఇప్పటికే ఆకాశాన్ని తాకుతుండగా, తాజాగా వంటగ్యాస్ ధరలను పెంచుతూ తీసుకున్న నిర్ణయం సామాన్యుడి నడ్డి విరుస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చిన ఈ ధరల పెంపుపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

**తాజా ధరల వివరాలు**
తాజా నిర్ణయంతో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ (14.2 కేజీలు) ధరపై రూ. 60 పెరగగా, వాణిజ్య సిలిండర్ ధరపై ఏకంగా రూ. 115 భారం పడింది. దీంతో ప్రధాన నగరాల్లో డొమెస్టిక్ గ్యాస్ ధరలు ఈ విధంగా ఉన్నాయి:

**ప్రభుత్వం చెబుతున్న కారణాలు - విపక్షాల విమర్శలు**
పశ్చిమాసియాలో చోటుచేసుకున్న ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడమే ఈ పెంపునకు కారణమని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, అంతర్జాతీయ సంక్షోభాల సాకుతో ప్రజలపై భారం వేయడం సమంజసం కాదని ప్రతిపక్షాలు మరియు ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంలో మహిళలపై ఈ భారం వేయడం దారుణమని విమర్శిస్తున్నారు.

**వెల్లువెత్తుతున్న నిరసనలు**
రాజకీయ పార్టీల ఆందోళన: గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ, కాంగ్రెస్ వంటి ప్రధాన పార్టీలు దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయి. తెలంగాణలో రాష్ట్ర కమిటీ ఆదివారం రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపట్టింది. సామాన్యుల ఆవేదన: గ్యాస్ ధర పెరగడం వల్ల హోటళ్లు, క్యాంటీన్లలో ఆహార పదార్థాల ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది, ఇది పరోక్షంగా ప్రతి సామాన్యుడిపై భారం చూపుతుంది.

**ఉజ్వల లబ్ధిదారుల పరిస్థితి:**
ఉజ్వల యోజన లబ్ధిదారులకు సబ్సిడీ ఉన్నప్పటికీ, తాజా పెంపుతో వారు కూడా ఒక సిలిండర్‌కు సుమారు రూ. 613 చెల్లించాల్సి వస్తోంది.

**డిమాండ్**
పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, సామాన్యుల కొనుగోలు శక్తిని దృష్టిలో ఉంచుకుని గ్యాస్ ధరలను తగ్గించాలని ప్రజలు మరియు ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. గ్యాస్ ధరల పెరుగుదల ఇలాగే కొనసాగితే పేద కుటుంబాలు మళ్లీ కట్టెల పొయ్యి వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముదిగొండలో ఐద్వా ఆధ్వర్యంలో కట్టెల పొయ్యి పెట్టి,సిలిండర్ తో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం పురుషోత్తం. ఐద్వా మండల కార్యదర్శి కోలేటి అరుణ,రైతు సంఘం రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్,మండల కార్యదర్శి కోలేటి ఉపేంద్రరావు,గ్రామ సర్పంచ్ కట్టకూరి ఉపేందర్. ఉపసర్పంచ్ చెరుకూరి పార్వతి.సిఐటియు మండల కన్వీనర్ టిఎస్ కళ్యాణ్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వేల్పుల భద్రయ్య,డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు, మండల కార్యదర్శి మెట్టెల సతీష్,పలువురు పంచాయతీ వార్డు సభ్యులు,మహిళలు పాల్గొన్నారు.

### నూతన మహిళా సంఘ భవనాన్ని ప్రారంభించిన
# మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**టి మీడియా,మార్చి 08,ఎండపల్లి:**
రాష్ట్రంలోని ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో రూపుదిద్దుకున్న 'మణిదీప, వినాయక గ్రామ పరస్పర సహాయక పొదుపు,పరపతి సహకార సంఘం'నూతన భవనాన్ని ప్రారంభించి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆనందోత్సవాల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బాధ్యతలు స్వీకరించాక, మహిళా సాధికారతకు చిహ్నంగా 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకంపైనే తొలి సంతకం చేశారని గుర్తుచేశారు. కేవలం పొదుపుకే పరిమితం కాకుండా,మహిళా సంఘాలు ఇకపై ఆర్టీసీ బస్సుల నిర్వహణ,పెట్రోల్ బంకులు,సోలార్ పవర్ ప్లాంట్లను కూడా నడిపేలా ప్రభుత్వం ప్రణాళికలు చేపట్టిందని,రాజారాంపల్లి గ్రామ మహిళల కోసం ప్రత్యేకంగా మటన్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుతో పాటు ఇతర స్వయం ఉపాధి పథకాలను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించారు."మహిళలు ఆర్థికంగా బలోపేతమైతేనే కుటుంబం,సమాజం అభివృద్ధి చెందుతాయాని ప్రభుత్వం అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకొని మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలిఅని,మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.తదానంతరం గ్రామ సర్పంచ్ సంగ రమేష్ మాట్లాడుతూ,మహిళలకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రికి విన్నవించారు.కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లత, డిఆర్ డిఓ రఘువరన్,మార్కెట్ కమిటీ చైర్మన్ గోపిక,మద్దుల గోపాల్ రెడ్డి,తహసీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్,ఎంపిడిఓ కృపాకర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శైలందర్ రెడ్డి, కోటిలింగాల ఆలయ కమిటీ చైర్మెన్ పూదరి రమేష్,గాజుల విజయ్ గాజుల శ్రీనివాస్,చాపల రమేష్,ఎపిఓ తులసిమాత,అధికారులు,ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేదోడి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం



**టీ మీడియా,మార్చి 8,పెబ్బేరు:**
ఆదివారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల నిజంగా సాకారమవుతోందని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు పట్టణంలోని 10వ వార్డులో నూతనంగా నిర్మించిన తెలుగు పార్వతి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు స్థానిక చైర్మన్ కౌన్సిలర్ మన్యం ఇంటి యజమానికి శుభాకాంక్షలు తెలిపారు పేద ప్రజలకు ఈ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

## మహిళలురంగాలలోనైనా విజయం సాధిస్తారు

- ఎస్.ఐ షాహీన






**టి మీడియా,మార్చి 8,ఖమ్మం :**
నగరంలోని సమర్థనం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్.ఐ షాహీన పాల్గొని ప్రసంగించారు . మహిళలు అన్ని రంగాలలో ముందు ఉండాలని భవిష్యత్తులో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి టెక్నాలజీలతో పోటీ పడాలని టెక్నికల్ స్కిల్స్ తో పాటు క్రమశిక్షణ ఆత్మస్థైర్యం కలిగి ఉండాలి అన్నారు . మహిళలు అభివృద్ధి చెందినపుడే కుటుంబం సమాజం బాగుంటుందని చెడు మార్గంలో ప్రయాణిస్తే సమాజంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవలసి ఉంటుందన్నారు . ఎన్ని కష్టాలు ఎదురైనా విద్యను నిర్లక్ష్యం చేయవద్దని భవిష్యత్తులో విద్య ఒక్కటే మహిళలకు జీవనాధారం అవుతుందన్నారు . ఈ సందర్భంగా ఉచిత శిక్షణ కేంద్రం నిర్వాహకులను అభినందించారు . అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియచేశారు . ఈ కార్యక్రమంలో శిక్షణా కేంద్రం నిర్వాహకులు సీనియర్ అధ్యాపకులు కోడిరెక్క ఉమా శంకర్ , గోగుల చంద్రశేఖర్ , ట్రైనర్స్ అవులూరి సౌమ్య , కల్లేపు అఖిల , మెహరిన్ పాల్గొన్నారు.

# టి మీడియా ఆధ్వర్యంలో ఖమ్మం, ముదిగొండ కేంద్రంలో మహిళా దినోత్సవం దృశ్యాలు


























## అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**టీ మీడియా, మార్చి 8, వనపర్తి బ్యూరో :**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బిజెపి జిల్లా కార్యాలయంలో బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు అశ్విని రాధా ఆధ్వర్యంలో వివిధ రంగాలలో సేవలందించిన మహిళలను మరియు మున్సిపల్ ఎలక్షన్లో పోటీ చేసిన మహిళ అభ్యర్థులను సన్మానించటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన జిల్లా అధ్యక్షులు డి. నారాయణ మాట్లాడుతూ మహిళలు అని రంగాలలో ముందున్నారని నరేంద్ర మోడీ సంక్షేమ పథకాల వల్ల నేడు మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, మోడీ గారు బేటి పడావో బేటి బచావో యోజన ముద్ర లోన్స్, డ్రోన్ దీదీ 14 సంవత్సరాల బాలికల కోసం సర్వేకల్ క్యాన్సర్ నివారణ నిమిత్తం ఉచిత టీకాలను దేశవ్యాప్తంగా పంపిణీ చేస్తూ మహిళల ఆరోగ్య అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకొచ్చారని నారాయణ పేర్కొన్నారు. ఆర్డీఎస్ సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న చిన్నమ్మ తామస్ , సఖి కేంద్రం శ్రీలక్ష్మి, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ సుకన్య, , రిటైర్డ్ ఉపాధ్యాయురాలు సునీతా రాణి, డెంటల్ డాక్టర్ శ్వేత, లీగల్ సెల్ ద్వారా సేవలందిస్తున్న విజయలక్ష్మి, గార్లను సన్మానించడం జరిగింది .కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాకాసి లోక్నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, పెద్దిరాజు,వారణాసి కల్పన, రాష్ట్ర నాయకులు కేతూరి బుడ్డన్న,జిల్లా కోశాధికారి కుమారస్వామి, మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు అలివేలమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మమ్మ, మాజీ ఉపాధ్యక్షురాలు సుమిత్రమ్మ, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కవిత, తాజా మున్సిపల్ ఎన్నికల్లో కంటెస్టెంట్ అభ్యర్థులు సత్య తిరుపతి యాదవ్, దంతాజు కాంచన, చిన్నమ్మ కార్యకర్తలు పాల్గొన్నారు.




## గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో
# 'ప్రేరణ' విజ్ఞాన ప్రదర్శన

**టీ మీడియా మార్చి 8 కొణిజర్ల :** ఖమ్మం జిల్లాలోని తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ప్రతిభ వెలిగింది. విద్యార్థినులలో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని, సృజనాత్మకతను, పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన 'ప్రేరణ' (ప్రేరణ - భూమి పునరుజ్జీవనం మరియు నూతన వాతావరణం) విజ్ఞాన ప్రదర్శన (సైన్స్ ఎక్స్‌పో) అత్యంత వైభవంగా జరిగింది. "వ్యర్థం నుండి అర్థం" (వేస్ట్ టు బెస్ట్) అనే ప్రధాన అంశంతో




సాగిన ఈ ప్రదర్శన విద్యార్థుల మేధస్సుకు అద్దం పట్టింది. ఈ కార్యక్రమానికి 2026 పద్మశ్రీ పురస్కార గ్రహీత, రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డి ఆర్ డి ఓ) మాజీ విశిష్ట శాస్త్రవేత్త మరియు 'ఆకాష్' క్షిపణి ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ జి. చంద్రమౌళి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా తెలంగాణ జాతీయ హరిత సేన (నేషనల్ గ్రీన్ కోర్) రాష్ట్ర ప్రాజెక్టు అధికారి సీత పాల్గొన్నారు. గౌరవ అతిథిగా ప్రాంతీయ సమన్వయకర్త (రీజినల్ కో-ఆర్డినేటర్) బి. అరుణ కుమారి, కళాశాల ప్రిన్సిపాల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుండి విచ్చేసిన విద్యార్థినులు పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక అభివృద్ధి, మరియు పునర్వినియోగ ఇంధన వనరుల వంటి అంశాలపై అద్భుతమైన నమూనాలను ప్రదర్శించారు. ముఖ్యంగా వ్యర్థ పదార్థాల నుండి ఉపయోగకరమైన వస్తువులను తయారు చేసిన విధానం సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ ఉత్తమ ప్రయోగాలకు ప్రథమ బహుమతి: వాణిజ్య శాస్త్ర విభాగం (ఆర్గానిక్ సబ్బుల తయారీ). ద్వితీయ బహుమతి: రసాయన శాస్త్ర విభాగం. తృతీయ బహుమతి: వృక్ష శాస్త్ర విభాగం. అతిథులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ. ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రవేత్తలను మేల్కొల్పుతాయని, భవిష్యత్తులో దేశాభివృద్ధికి ఇవి ఎంతో తోడ్పడతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం సంఘటిత
# పోరాటాలకు సంకేతం

- ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

**టీ మీడియా,మార్చి08,సింగరేణి(కారేపల్లి) :**



అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం శ్రామిక మహిళల హక్కుల పోరాట దినమని ఐద్వా వైరా డివిజన్ అధ్యక్షురాలు కొండబోయిన ఉమావతి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు, సిఐటియు నాయకురాలు మేకల స్వరూపరాణి అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో కారేపల్లి మండలం మాణిక్యారంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ అనేది మహిళలపై జరుగుతున్న శ్రమ దోపిడికి వ్యతిరేకంగా, విద్యా, ఉద్యోగ, ఉపాధి రాజకీయ రంగాల్లో సమాన హక్కుల కోసం,వీధుల్లోకి వచ్చి పోరాడిన మహిళల త్యాగాలను స్మరించుకునే రోజు అని అన్నారు. శ్రమకు తగిన ఫలితం సాధనకై మహిళ చట్టాల రక్షణకై శ్రామిక మహిళలు నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రేపాకుల వీరభద్రం, పోతర్ల నాగేశ్వరరావు, వల్లపు మల్లయ్య, దేగటి రాజమ్మ, గడ్డబోయిన సుభద్ర, అజ్మీర జ్యోతి, ఉష, సునీత, రుక్మ, సుగుణమ్మ, రమ్యా, సక్కుబాయి, సాయమ్మ, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



## మాధరంలో ప్రగతి ప్రణాళికా కార్యాచరణ

### పలుగు పారా పట్టిన ఎంపీడీవో, సర్పంచ్

**టీ మీడియా,మార్చి08,సింగరేణి(కారేపల్లి):** కారేపల్లి మండలం మాదారంలో ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఆదివారం ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచ్ అజ్మీర ఉమా నరేష్ లు పర్యటించారు వీధుల్లో తిరుగుతూ ప్రజలాభిష్టాన్ని తెలుసుకున్నారు. సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య పనులను ఎంపీడీవో సర్పంచులు స్వయంగా పలుగు, పారా పట్టి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ అవసరాలను అభివృద్ధిని ప్రగతి ప్రణాళికలో నిర్వహించుకుందామన్నారు. ప్రజల అభీష్టం మేరకు గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయింపు జరుగుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవడానికి ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బానోత్ మంజులాల్ ,సౌందర్య నగేష్ భానోత్ కోటేష్, నగేష్ వాంకుడోత్ వీరన్న, పాల్తియా వెంకన్న, బర్మాత్ గోవిందు, పాప, బర్మావత్ వీరు తదితరులు పాల్గొన్నారు.



## ఖాళీ గ్యాస్ సిలిండర్ తో సీపీఐ(ఎం) ఆందోళన


- గ్యాస్ ధర పెంపును ఉపసహరించాలి

**టీ మీడియా,మార్చి08,సింగరేణి(కారేపల్లి):**
కేంద్ర ప్రభుత్వం వంటా గ్యాస్ ధరలను పెంచటం నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆదివారం మాణిక్యారంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఖాళీ గ్యాస్ బండను రోడ్డుపై ఉంచి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పేదల గురించి పట్టించుకోవడంలేదని తన కార్పొరేట్ మిత్రుల లాభం కోసం పనిచేస్తుందని విమర్శించారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ చేతిలో కీలుబొమ్మగా మారిన మోడీ తక్కువ ధరకు క్రూడ్ ఆయిల్ గ్యాస్ అందిస్తున్న మిత్ర దేశమైన రష్యా ను కాదని అమెరికాకు మోకరిల్లుతున్నారని ఆక్షేపించారు. ఇరాన్ – ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి గ్యాస్ ధరల పెంపు అనైతికమన్నారు. గ్యాస్ , ఆయిల్ దిగుమతులకు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్న వాటిని తన కార్పొరేట్ మిత్రుల స్వలాభం కోసం విస్మరిస్తున్నారని అన్నారు పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కొండబోయిన ఉమావతి, పోతర్ల నాగేశ్వరరావు, పంచాయతీ 3 వ వార్డు సభ్యురాలు అజ్మీర జ్యోతి, బసరాజు రమేష్, వల్లపు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



## వసతి గృహంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**టీ మీడియా, మార్చి 8, వనపర్తి బ్యూరో :** వనపర్తి పట్టణ ప్రభుత్వ విద్యా కళాశాల బాలుర వసతి గృహంలో ఆదివారం సాయంత్రం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వసతి గృహంలో సేవలందిస్తున్న మహిళా సిబ్బంది లక్ష్మీ నాగమ్మ, సుజాతలను వసతి గృహ సంక్షేమ అధికారి పసుల సాత్విక సత్యనారాయణ యాదవ్ శాలువా, శాలీలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రజినీకాంత్, ఎల్లయ్య కళాశాల వసతిగృహ విద్యార్థులు పాల్గొన్నారు.





## నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన జిల్లెల

**టీ మీడియా, మార్చి 8, వనపర్తి బ్యూరో :** హైదరాబాద్ మాదాపూర్ శిల్పారామంలో పెద్దమందడి మండలం చిలుక టోని పల్లె గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎస్పి సర్వేశ్వర్ రెడ్డి కుమారుని వివాహ వేడుకకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పాల్గొని దినేష్ రెడ్డి, మానస నూతన వధూ వరులకు శుభాకాంక్షలు తెలిపి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. హైదరాబాద్ శంషాబాద్ ఎస్.ఎస్. కన్వెన్షన్ హాల్ లో రామన్ పాడ్ కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ రెడ్డి అన్న కూకట్ పల్లి వాస్తవ్యులు అయినా చాపల మాధవి వెంకటేశ్వర్ రెడ్డి కూతురు వివాహానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై గాయత్రి రెడ్డి, అవినాష్ రెడ్డి లకు వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రామన్ పాడ్చాపల శ్రీధర్ రెడ్డి ,నరసింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి బంధుమిత్రులు పాల్గొన్నారు.

## రక్తనమూనాల్లో..

# ఇథలీన్ గ్లైకాల్

- కస్టడీలోకి వ్యాపారి,విచారణ
- 80 లీటర్ల పాలకు 30 లీటర్ల నీళ్లు



**టి మీడియా, మార్చి 8, రాజమహేంద్రవరం :**
రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనలో కిడ్నీలు దెబ్బతిని 11 మంది మృతి చెందడానికి ""ఇథలీన్ గ్లైకాల్" కలిసిన పాలే కారణమని ఫోరెన్సిక్ నిపుణులు నిర్ధారించారు. బాధితుల నుంచి సేకరించిన రక్త నమూనాలను పరీక్షించారు. అనంతరం ప్రయోగశాలల (ల్యాబ్) నుంచి ఐదుగురి నివేదికలు (రిపోర్టు) వచ్చాయి. విషపూరిత పాలు కారణంగా పలు అవయవాలు దెబ్బ తినడం వల్ల బాధితులు మరణించారని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీఆర్?ఎఫ్ఎస్?ఎల్ నివేదికలు స్పష్టం చేశాయి. పాల వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేడు కూడా అతన్ని విచారించనున్నారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన వ్యక్తి పాల వ్యాపారి గణేశ్వరరావు. గత నెల 15న రైతుల వద్ద నుంచి యథావిధిగా పాలు సేకరించాడు. వాటిని అతడు అనధికారికంగా నడుపుతున్న కేంద్రానికి తీసుకొని వెళ్లి రెండు ఛాంబర్లు ఉన్నటువంటి ఫ్రీజర్?లో ఉంచాడు. ఎడమవైపు ఛాంబర్ లీక్ అయ్యింది, దీని వల్ల శీతలకరణిగా ఉపయోగించే ఇథలీన్ గ్లైకాల్ సరఫరా చేసే పాలలో కలిసి పోయింది. పాలు చేదుగా ఉన్నాయని స్థానికులను చెప్పినా నిర్లక్ష్యం చేసినట్లు అతని పై ఆరోపణలు ఉన్నాయి. బంధువు హెచ్చరికలను కూడా అతను పట్టించుకోలేదని చెబుతారు. తరువాత, ఓ ఛాంబర్?కు మరమ్మతులు చేసి, లీక్ అవ్వకుండా ఎం-సీల్ పూసాడు. అప్పటికే అతను ఇచ్చిన విషపూరిత పాలు వినియోగించడం వల్ల బాధితులు కిడ్నీ సంబంధిత సమస్యలతో ఆసుపత్రుల పాలయ్యారు. గణేశ్వరరావు పై ఇప్పటి వరకు 9 కేసులు నమోదు అయ్యాయి. అతడిని 2 రోజుల కస్టడీకి పంపేందుకు కోర్టు అనుమతిచ్చింది.. దీంతో శనివారం పోలీసులు అతన్ని విచారించారు. ప్రతిరోజూ దాదాపు 80 లీటర్ల పాలు సేకరించి, వాటిలో 30 లీటర్ల కుళాయి నీరు కలిపి తర్వాత విక్రయించే వాడినని చెప్పినట్లు తెలిసింది. పాలలో డిటర్జెంట్ ఆనవాళ్ల పై ప్రశ్నించారు. ఛాంబర్లు శుభ్రం చేసేందుకే ఉంచానని, పాలలో ఎటువంటి డిటర్జెంట్లు కలప లేదని అతడు బదులిచ్చినట్లు తెలిసింది. ఫ్రీజర్ లీకేజీ గురించి తెలిసినా, ఇంత ప్రమాదం జరుగుతుందని తాను ఊహించలేదని కస్టడీలో చెప్పినట్లు సమాచారం.

### - మూడు దశల్లో ప్రభావం

ఇథలీన్ గ్లైకాల్?ను పరిశ్రమల్లోని చిల్లింగ్ కేంద్రాలు, కార్లు, ట్రక్కుల్లో వినియోగిస్తారు. ఇది శరీరంలోకి చేరితే గనక 3 దశల్లో దాని ప్రభావం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మత్తుగా ఉండడం, వికారం, వాంతులు వంటి లక్షణాలు ఉంటాయి అని చెబుతున్నారు. 24 గంటల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుంది, రక్తపోటు తగ్గడం, గుండె దడ, 72 గంటల్లో మూత్రపిండాలు దెబ్బ తింటాయి, మూత్ర విసర్జన కాకపోవడం, నరాలు, మెదడు, గుండె సమస్యలు వంటి సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు.

### - పాత విధానంలోనే కూలింగ్ ఏర్పాట్లు

తూర్పుగోదావరి జిల్లాలో పాడి రైతుల నుంచి చాలా మంది వర్తకులు పాలు సేకరిస్తారు. వీరంతా ఫ్రీజర్?లో ఉంచి ఉదయానివి సాయంత్రం విక్రయిస్తారు. అలాగే సాయంత్రం తీసుకున్నవి మర్నాటి ఉదయం పాలు సరఫరా చేస్తుంటారు. గతంలో అయితే ఫ్రీజర్?లో కూలింగ్ నిమిత్తం ఉప్పు నీటి ద్రావకం వేసే వారు. దీనివల్ల తుప్పు సమస్య వస్తున్నాయి. దీంతో ఇథలీన్ గ్లైకాల్ వినియోగిస్తున్నట్లుగా తెలిసింది. ఛాంబర్ల దిగువన 75 శాతం నీరు, 25 శాతం ఇథలీన్ గ్లైకాల్ వేసి కూలెంట్?గా వినియోగిస్తున్నారు. లీటరు గ్లైకాల్ రూ.180 నుంచి రూ.200 చొప్పున ధర ఉంటుంది. ప్రస్తుత ఘటన నేపథ్యంలో కొంతమంది వ్యాపారులు మెకానిక్?లను ఆశ్రయిస్తున్నారు. పాల కేంద్రాల్లో పాత విధానంలోనే కూలింగ్ ఏర్పాట్లు చేయించుకుంటున్నారు.

### - కల్తీ పాల ఘటనలో మరొకరి మృతి

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనకు సంబంధించి శనివారం (నిన్న) ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో మహిళ మృతి చెందారు. నగరంలోని ఆర్?టీవో కార్యాలయం ప్రాంతానికి చెందిన బి.అనంతలక్ష్మి (72) ఫిబ్రవరి 16న కల్తీ పాలు తాగడంతో అస్వస్థతకు గురయ్యారు. 17న ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. మెరుగైన వైద్య సేవలకు మరో ఆసుపత్రికి మారి చికిత్స పొందారు. కిడ్నీలు దెబ్బ తినడంతో వెంటిలేటర్? పై ఉంచి డయాలసిస్ చేస్తూ చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనలో ఈ నెల 5 వరకు 10 మంది మృతి చెందగా, అనంతలక్ష్మి మృతితో ఈ సంఖ్య 11కి చేరింది.

# తెలుగు రాష్ట్రాల ప్రజలకు అలర్ట్..

### జాగ్రత్తగా ఉండాల్సిందే

**టి మీడియా, మార్చి 8, హైదరాబాద్ బ్యూరో:**



తెలుగు రాష్ట్రాల్లో వేసవికాలం మొదలైపోయింది. భానుడి భగభగలతో ఎండలు తీవ్రతరం అవుతున్నాయి. ఎండ వేడితో పాటు ఉక్కబోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం వేళల్లో భానుడి ప్రతాపం తీవ్ర స్థాయిలో ఉండగా.. ప్రజలకు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఈ క్రమంలో ఉష్ణోగ్రతలపై ప్రజలకు వాతావరణశాఖ అలర్ట్ జారీ చేసింది. ఏపీ, తెలంగాణలో రాబోయే ఐదు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందని, ఎండ ప్రభావం నుంచి ప్రజలు దూరంగా ఉండాలని హెచ్చరించింది. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు జగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. తెలుగు రాష్ట్రాల్లో రాబోయే ఐదు రోజుల్లో వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయనేది ఒకసారి చూద్దాం.

### ఏపీ ప్రజలకు అలర్ట్

మన్నార్ గల్ఫ్ నుండి తమిళనాడు, దక్షిణ అంతర కర్ణాటక మీదుగా ఉత్తర అంతర కర్ణాటక వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఏపీ, యానంలో దిగువ ట్రోపో ఆవరణములో దక్షిణ/ నైరుతి గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో ఆదివారం, సోమవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందన్నారు. ఎల్లుండి పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందంది. ఇక దక్షిణ కోస్తాలో ఈరోజుపొడి వాతావరణం ఏర్పడే అవకాశముండగా.. రేపు, ఎల్లుండి కూడా పొడి వాతావరణం ఉంటుందంది. అటు రాయలసీమలో కూడా పొడి వాతావరణం ఏర్పడే అవకాశముంది. రాగల 5 రోజుల్లో ఏపీ,యానాంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1-3 డిగ్రీలు ఎక్కువగా ఉండే అవకాశంముందని, ఆ తరువాత 2రోజుల్లో క్రమంగా పెరిగే అవకాశముందని పేర్కొంది.

### తెలంగాణకు హెచ్చరికలు

ఇక తెలంగాణ లో రాగల మూడు రోజుల వరకు ఉష్ణోగ్రతలు పెరుగుతాయని హైదరాబాద్ వాతావరణశాఖ తెలిపింది. రాష్ట్రంలో క్రింది స్థాయి గాలులు ప్రధానంగా దక్షిణ / ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్నాయి. నిన్న ఒడిస్సా పరిసరాలలో ఉన్న ఉపరితల చక్రవాత ఆవర్తనం నుండి తెలంగాణ, అంతర్గత కర్ణాటక మీదుగా కర్ణాటక తీరం వరకు కొనసాగిన ద్రోణి ఈరోజు బలహీనపడింది. ఈ రోజు, రేపు, ఎల్లుండి రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో రాగల రెండు రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి నుంచి రెండు నుంచి మూడు డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.



టి మీడియా (తెలుగు డిజిటల్ )

## ట్రాన్స్ఫార్మర్ సమస్యను తొలగించిన కౌన్సిలర్



**టీ మీడియా, మార్చి 8, వనపర్తి బ్యూరో :** వనపర్తి పట్టణంలోని 22 వ వార్డు లోని ఈద్గా మస్జిద్ మలుపు దగ్గర రాయితో నిర్మించిన దిమ్మె పై క్రిందికి ఉన్న ట్రాన్స్ఫార్మర్ వల్ల చిన్న పిల్లలకు, వృద్ధులకు, వాహనదారులకు చాలా ఇబ్బంది కలుగుతుంది అని అట్టి ట్రాన్స్ఫార్మర్ ని ఆదివారం అక్కడి నుండి తొలగించి అదే రోడ్డు మార్గంలో ఎత్తయిన పిల్లర్ స్తంభం పై ఏర్పాటు చేయించిన 22వ వార్డు కౌన్సిలర్ ఏర్వ అరుణ మెకానిక్ శ్రీను. ఇట్టి కార్యక్రమంలో వాజిద్ అలీ ఖాన్,గౌనికాడి యాదయ్య, ఫరూక్,మీరన్,హారీఫ్ అలీఖాన్, సత్తార్, మసుమ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## పుర చైర్మన్ కు పలు సమస్యలపై వినతి

### అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్



**టీ మీడియా, మార్చి 8, వనపర్తి బ్యూరో :** వనపర్తి పట్టణంలోని చైర్మన్ ఇంటిదగ్గర వారిని కలిసి అభినందనలు తెలిపిన తర్వాత వారికి వినతిపత్రం ఇస్తూ మున్సిపాలిటీలోని పలు సమస్యలు విన్నవించడం జరిగింది. అందులో ముఖ్యంగా వనపర్తి పట్టణంలో రోడ్డు వెడల్పు పని త్వరగా చేయాలని, నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలని,మున్సిపాలిటీలోని కార్మికులకు పెండింగ్ లో ఉన్న బాకీలు తీర్చి సమస్యలను పరిష్కరించాలని, మెయిన్ రోడ్ లో రోడ్డును ఆక్రమించుకున్న పెద్దలకు నోటీసులు ఇచ్చి రోడ్డును రక్షించాలని పార్కింగ్ లేని మాల్స్ ను రద్దు చేయాలని వారికి అపరాధ రుసుము విధించాలని టౌన్ హాల్, సమీకృత మార్కెట్ భవనాలను అందుబాటులోకి తేవాలని సూచిస్తూ మీకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వనపర్తి ప్రజలకు సేవ మాత్రమే చేయాలని, అవినీతికి, మధ్యవర్తులకు అవకాశం ఇవ్వద్దని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కొత్త గోళ్ళ శంకర్, దయానంద్ ముదిరాజ్, చంద్రశేఖర్, రామస్వామి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసిన డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి రాష్ట్ర ఏఐపిసి అధ్యక్షులు



**టీ మీడియా, మార్చి 8, వనపర్తి బ్యూరో :** హైదరాబాదులో కోకాపేటలో అక్షయ్ కన్వెన్షన్ హాల్ లో వనపర్తి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన కొండ జగన్మోహన్ రెడ్డి మనవరాలు వివాహ వేడుకల్లో రాష్ట్ర ఏఐపిసి అధ్యక్షులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసినారు ఈ కార్యక్రమంలో రామేశ్వర్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.




## పదవ తరగతి విద్యార్థులకు విజయ్ అన్న విద్యా కానుక

**టీ మీడియా మార్చి 08పెబ్బేరు :** ఆదివారం పెబ్బేరు మండలంలోని బునియాదిపురం గ్రామంలోని పదవ తరగతి విద్యార్థులు పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొని మంచి ఫలితాలు సాధించేందుకు ప్రోత్సాహంగా ఎగ్జామ్ ప్యాడ్స్ పెన్స్ అవసరమైన పరీక్షా సామగ్రితో కూడిన ఎగ్జామ్ కిట్లను విద్యార్థులు లావణ్య కవిత హర్షిత శశిధర్ ప్రవీణ్ కార్తీక్ సాయి చరణ్ భరత్ గోపీచంద్ అభి వీరికి అందజేయడం జరిగింది

ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం మన గ్రామ విద్యార్థులు చదువులో రాణించి మంచి ఫలితాలు సాధించి వారి జీవితానికి బలమైన పునాదిని ఏర్పరచుకోవడం మన గ్రామం నుండి మరింత మంది ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయికి చేరుకోవాలని ఆశయంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వజగౌని విజయ్ గౌడ్ మాజీ సర్పంచ్ వనం రాములు వార్డ్ మెంబర్లు అలీమా మాబు రమేష్ సత్యం రాజు సహదేవుడు పాఠశాల ఉపాధ్యాయులు హెచ్ఎం నాగశేషులు టీచర్ దయానంద టీచర్ దుర్గాప్రసాద్ విద్యాభిమానులు కోరే రఘు ఎల్ల స్వామి రామన్ గౌడు కరుణాకర్ కృష్ణయ్య గౌడ్ ఆంజనేయులు వనం నరేష్ గ్రామస్తులు సెటమోని కురుమన్న గుడిసె కురుమన్న సుంకులన్న చిన్న రాముడు రమేష్ గోవిందు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

అదేవిధంగామన గ్రామంలో విద్యాభివృద్ధి కోసం ప్రత్యేకంగా విద్యా నిధి ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచ్ వజగౌని విజయ్ గౌడ్ ప్రకటించారు ఈ నిధి ద్వారా భవిష్యత్తులో విద్యార్థులకు పుస్తకాలు స్కాలర్షిప్‌లు పరీక్షా సామగ్రి అవసరమైన విద్యా సహాయం అందించనున్నట్లు తెలిపారు అలాగే విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధి కోసం వికాస తరగతులు కెరీర్ మార్గదర్శక శిబిరాలుమెరిట్ ఆధారిత ప్రోత్సాహక బహుమతులు పేద విద్యార్థులకు ప్రత్యేక సహాయం

ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్షిప్‌లు వంటి కార్యక్రమాలను కూడా గ్రామంలో నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు మన గ్రామ విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉండాలి అదే మన అందరి లక్ష్యం బునియాదిపురం గ్రామం నుంచి మరింత మంది డాక్టర్లు ఇంజనీర్లు అధికారులుగా వ్యక్తులుగా ఎదగాలని మనందరం కోరుకుందాం



## మీనాక్షి ఆసుపత్రిలో విజయవంతంగా ఉచిత వైద్య శిబిరం

### -డాక్టర్ శ్రావ్య (ఎండి. జనరల్ మెడిసిన్ డయాబెటాలజిస్ట్)

**టీ మీడియా, మార్చి 8, వనపర్తి బ్యూరో :** మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలో గల మీనాక్షి ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ శ్రావ్య (ఎండి. జనరల్ మెడిసిన్ డయాబెటాలజిస్ట్) ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి పట్టణంలో మొట్టమొదటిసారిగా ఏకైక వైద్యురాలిగా ఎండి. జనరల్ మెడిసిన్ డయాబెటాలజిస్ట్ సేవలు అందిస్తున్న మీనాక్షి ఆసుపత్రిలో వివిధ రకాల రక్త పరీక్షలతో పాటు గుండె, కిడ్నీలకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు ఆసుపత్రి పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని తెలిపారు. అలాగే మరో ఐదు రోజులు ఉచితంగా అవుట్ పేషెంట్ సేవలు అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్రద, డాక్టర్ పంతులు పీడియాట్రిక్స్, హాస్పటల్ సిబ్బంది, స్థానిక మున్సిపల్ చైర్మన్,కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు.